సాక్షి
నంద్యాల
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



కేసీకి నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు సోమవారం 159 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో 1.194 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



శాస్త్రోక్తంగా సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: పురాతన మండపంలో భ్రమరాంబా మల్లికార్జునస్వామికి సోమవారం సహస్ర దీపార్చన సేవ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



కన్నీటి వీడ్కోలు

మావోయిస్టుల ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ గొంగటి సుధాకర్ రెడ్డికి సోమవారం వెలగటూరు గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. 8లో▸

న్యూస్‌రీల్

గ్రూప్ -2 అభ్యర్థులకు ఉచిత శిక్షణ

నంద్యాల(అర్బన్): గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షకు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులైన డిగ్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి లక్ష్మీదేవమ్మ, ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కర్నూలు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు అర్హులని, దరఖాస్తులను ఏపీ బీసీ స్టడీ సర్కిల్ కల్లూరు, తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా అబ్బాస్ నగర్, కర్నూలుకు ఈ నెల 26వ తేదీ లోగా స్వయంగా, పోస్టు ద్వారా పంపాలన్నారు. 45 రోజుల ఉచిత శిక్షణకు అభ్యర్థుల ఎంపిక డిగ్రీ మెరిట్ ప్రాతిపదికన జరుగుతుందన్నారు. ఉచిత స్టడీ మెటీరియల్‌ను అందజేస్తామన్నారు. శిక్షణా కాలం పూర్తయిన తర్వాత అర్హులైన అభ్యర్థులకు స్టైఫండ్ మంజూరవుతుందన్నారు. ఇతర వివరాలకు 08518 236076ను సంప్రదించాలన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతీ యువకులకు పర్యాటక శాఖ ద్వారా శిక్షణ నిచ్చి ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు...రెస్టారెంట్ కెప్టెన్, కిచెన్ సూపర్‌వైజర్ కోర్సుల్లో ఉచిత శిక్షణతో పాటుగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని జిల్లా పర్యాటక శాఖాధికారి సీహెచ్ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత పర్యాటక శాఖ, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో కళాశాలను స్థాపించి నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపేందుకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్(సీడాప్) కలిసి దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ గ్రామీణ కౌశల్ యోజనలో భాగంగా ఈ ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారన్నారు. ఇంటర్ లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18-28 ఏళ్ల లోపు వయసున్న యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ లేదా సీడాప్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

70 శాతం సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ

నంద్యాల(సెంట్రల్): జిల్లాకు 2023-24 సంవత్సరానికి సంబంధించి 5 వేల హెక్టార్ల బిందు, తుంపర సేద్య పరికరాల పంపిణీ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించగా ఇప్పటి వరకు 70 శాతం పూర్తయినట్లు జిల్లా సూక్ష్మ సేద్య పథక సంచాలకులు సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,500 హెక్టార్ల విస్తీర్ణంలో పరికరాల ఏర్పాటు చేశామన్నారు. మార్చి నెలాఖరుకు లక్ష్యాన్ని చేరుకునే విధంగా చర్యలు చేపట్టామన్నారు. 5 ఎకరాలలోపు భూమి కలిగిన రైతులకు 90 శాతం రాయితీతో, 5 ఎకరాలు పైబడి 10 ఎకరాల లోపు వారికి 70 శాతం రాయితీతో, 12 ఎకరాలలోపు పొలం ఉన్న వారికి 45 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేస్తున్నామన్నారు. స్ప్రింక్లర్ల విషయంలో 5 ఎకరాలకు తక్కువ భూమి ఉన్న వారికి 55 శాతం, 12 ఎకరాలలోపు వారికి 45 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతన్నలు సంబంధిత ఆర్బీకేల్లో సంప్రదించాలని, డాక్యుమెంటేషన్ కంపెనీ ప్రతినిధులే చేస్తారని పేర్కొన్నారు. రైతు వాటా కింద చెల్లించే సొమ్మును ఫోన్‌పే ద్వారా నేరుగా మైక్రోఇరిగేషన్ సంస్థకు చెల్లించే సౌకర్యం ఉందన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు



వర్మికంపోస్టును పరిశీలిస్తున్న గంధం చంద్రుడు

కల్లూరు: గ్రామీణ ప్రాంత ప్రజలకు చెత్త సేకరణ, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడు అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ భవనాలను ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లోని క్లాప్ మిత్రలతో ఆయన మాట్లాడారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూస్ ఎస్ఈ నాగేశ్వరరావు, కర్నూలు డివిజనల్ పంచాయతీ అధికారి తిమ్మక్క, ఉలిందకొండ, చిన్నటేకూరు సర్పంచ్‌లు సుంకులమ్మ, లక్ష్మన్న పాల్గొన్నారు.

పాత్ర మెరిసి.. కష్టాలు తొలగి

- సర్కార్ బడుల్లో నిశ్చింతగా వంట
- గోరుముద్దకు నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ వంట పాత్రలు సరఫరా
- ఒక్కో పాఠశాలకు 5 నుంచి 11 రకాల వంట సామగ్రి
- 'మధ్యాహ్న భోజన' నిర్వాహకులకు తప్పిన అవస్థలు

నాడు: బీటలు వారిన పాఠశాల గోడలు.. పెచ్చులూడిపడే తరగతి పైకప్పులు.. విరిగిన బెంచీలు.. దుర్గంధం వెదజల్లే మరుగు దొడ్లు.. సగం విద్యా సంవత్సరం పూర్తయినా అరకొర పాఠ్యపుస్తకాలతో బోధన.. వర్షం వస్తే సెలవులు.. లొక్కులు పడిన పాత వంట సామగ్రితో వంట ఏజెన్సీల కష్టాలు.. వంట కార్మికులకు సరిగా అందని జీతాలు.. ఇదీ నాలుగునరేళ్ల క్రితం వరకు ప్రభుత్వ పాఠశాలల దుస్థితి.

నేడు: అందమైన భవనాలు.. ఆహ్లాదకరమైన తరగతి గదులు.. ఆధునికమైన డబుల్ డెస్క్ బెంచీలు.. డిజిటల్ తరగతులు.. చల్లని గాలి వీచేలా ఫ్యాన్లు.. ఆర్వో ప్లాంట్లతో మినరల్ వాటర్.. పరిశుభ్రంగా ఉండే మరుగుదొడ్లు.. పాఠశాల ప్రారంభమైన రోజే రెండు జతల యూనిఫాం, బూట్లు, టై, బెల్టు, పుస్తకాలు ఉండే స్కూల్ బ్యాగు అందజేత.. రోజుకు ఒక మెనూ.. రోజు విడిచి రోజు రాగి జావ.. వంట కార్మికులకు సకాలంలో బిల్లులు, జీతాలు మంజూరు.. అన్నిటికి మించి పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి ఖాతాలో ఏటా అమ్మ ఒడి కానుక.. తాజాగా మధ్యాహ్న భోజనం వంటకు అత్యంత నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ వంట సామగ్రి పంపిణీ.

జిల్లాలో వంట సామగ్రి పంపిణీ చేసిన పాఠశాలలు కేటగిరీల వారీగా

కేటగిరీ	పాఠశాలలు	ఒక్కో పాఠశాలకు పంపిణీ చేసిన సామగ్రి
ఏ	370	5
బీ	295	5
సీ	422	6
డీ	126	6
డీ	67	11
ఎఫ్	89	11



ఓబులంపల్లె ఎంపీపీ స్కూల్‌లో స్టీలు పాత్రలతో వంట చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నాడు-నేడుతో సర్కార్ బడుల రూపు రేఖలు సమూలంగా మార్చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో సమూల మార్పులు తెచ్చారు. రోజుకో మెనూతో పౌష్టికాహారం అందిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి రాగి జావ ఇస్తున్నారు. మెనూ చార్జీలు పెంచడంతో పాటు మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు ఎప్పటికప్పుడు బిల్లులు విడుదల చేస్తున్నారు. తాజాగా వంట కార్మికుల దశాబ్దకాలంగా ఎదుర్కొంటున్న సమస్య తీర్చేందుకు అత్యంత నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు అందజేశారు. ప్రభుత్వ నిర్ణయంతో వంట ఏజెన్సీల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నంద్యాల జిల్లాలోని 29 మండలాల పరిధిలోని 1,369 పాఠశాలల్లో 1,369 మధ్యాహ్న భోజన ఏజెన్సీల ఆధ్వర్యంలో జగనన్న గోరుముద్ద పథకం అమలు అవుతోంది. వీటిలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఏజెన్సీలను ఆరు కేటగిరీలుగా విభజించారు. 30 లోపు విద్యార్థులున్న వాటిని ఏ-కేటగిరీ, 31 నుంచి 50 మధ్య ఉంటే బీ, 51 నుంచి 150 వరకు ఉంటే సీ, 151 నుంచి 250 మధ్య డీ, 251 నుంచి 400 వరకు ఈ, 400 అంతకంటే ఎక్కువ ఉంటే ఎఫ్ కేటగిరీలుగా పాఠశాలలు విభజించారు. గరిష్టంగా 25 కిలోల వరకు అన్నం వండేలా పాత్రలు మూతలతో పాటు వడ్డించేందుకు అవసరమైన గిన్నెలు, గరిటెలను కూడా ప్రభుత్వం సరఫరా చేసింది.

కొత్త పాత్రలతో వంటా వార్పు

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకుల కష్టాలకు ప్రభుత్వం విముక్తి కలిగించింది. సుమారు 14 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ఇచ్చిన వంట సామగ్రితోనే నిర్వాహకులు నెట్టుకొస్తున్నారు. కొన్ని చోట్ల అవి పూర్తిగా పాడై పోవడంతో కొందరు సొంత సొమ్ములు వెచ్చించి కొనుగోలు చేసి వంట చేస్తుండగా అనేక మంది నిర్వాహకులు వాటితోనే తంటాలు పడుతూ ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గమనించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నూతన సామగ్రిని సమకూర్చింది. పాత సిల్వర్ పాత్రల స్థానంలో నాణ్యతతో కూడిన అత్యాధునికమైన స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలను నిర్వాహకులకు అందజేసింది. నాణ్యతో పాటు సరిపడ పాత్రలు ఉండటంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సకాలంలో అందించేందుకు అవకాశం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత నాణ్యతతో కూడుకున్న వంట పాత్రలను అందించడంతో నిర్వాహకులు, సహాయకులతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పేరాయిపల్లె హైస్కూల్‌కు చేరిన నాణ్యమైన వంటసామాన్లు



గతంలో పాత సిల్వర్ పాత్ర ఇలా..

వంట చేయడం చాలా సులభమైంది



సుమారు 14 సంవత్సరాల క్రితం వంట పాత్రలు ఇచ్చారు. అప్పుడు ఉన్న 100 మంది పిల్లలకు అనుగుణంగానే పాత్రలు ఇచ్చారు. ఇప్పుడు 400 మంది పిల్లలకు వంట చేస్తున్నాం. వాటితోనే ఒక్కో సారి రెండు మూడుసార్లు వంట చేయాల్సి వచ్చేది. కొన్నింటిని సొంతంగా కొనుగోలు చేసుకున్నాం. మా ఇబ్బందులను చూసి ప్రభుత్వం సరఫరా చేసిన వంట పాత్రలు ఎంతో బాగున్నాయి. ఒకే సారి అందరికీ వంట చేస్తున్నాం.

– దస్తగిరమ్మ, పేరాయిపల్లె

అడగకుండానే సీఎం అన్నీ ఇచ్చారు



15 ఏళ్లుగా స్కూల్‌లో వంట చేస్తున్నా. ఒక్క సారి రెండు చిన్న సిల్వర్ పాత్రలు ఇచ్చారు అంతే. అవి పూర్తిగా చిల్లులు పడటంతో పక్కకుపడేశా. వంట పాత్రలు ఇవ్వాలని ఎన్నోసార్లు అధికారులను వేడుకున్నాం. నిరసన కూడా తెలిపినా ఎవరూ పట్టించుకోక పోవడంతో సొంతంగా అప్పు చేసి మూడు పాత్రలు కొనుక్కొచ్చుకుని వంట చేసి పెడుతున్నా. మా బాధలు చూసి ఇప్పుడు ఇచ్చిన స్టీల్ పాత్రలు ఎంతో బాగున్నాయి. జీతం కూడా సక్రమంగా వస్తోంది. అడక్కుండానే అన్ని సమకూర్చుతున్న సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– కిష్టమ్మ, యాదవాడ

రుచి, శుచిగా ఉండేలా శిక్షణ



విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు పౌష్టికాహారం ముఖ్యం. అందుకే ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పెట్టే మధ్యాహ్న భోజన పథకానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రోజుకో రకం మెనూతో నాణ్యమైన భోజనం అందజేస్తోంది. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు గుర్తించిన ప్రభుత్వం అన్ని పాఠశాలలకు నాణ్యమైన స్టెయిన్‌లెస్ స్టీల్ వంట సామగ్రి కిట్లను అందజేసింది. వంట చేసే కార్మికులు ఆహారపదార్థాలు రుచిగా, శుచిగా చేసేలా శిక్షణ ఇచ్చాం.

– సుధాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

పారదర్శక పాలనలో అర్హులకు న్యాయం

- పేదలను రైతులుగా మార్చిన ఘనత సీఎం జగన్‌ది
- బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అంతా బూటకం
- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి



ఆర్ఎస్ రంగాపురంలో భూహక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన, తహసీల్దార్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి బుగ్గన

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా పాలనలో అర్హులందరికీ న్యాయం జరుగుతోందని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో తహసీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, గ్రామ సర్పంచ్ రాజు, ఎంపీటీసీలు నాగేషు, వెంకట సుబ్బమ్మ ఆధ్వర్యంలో 180 మంది రైతులకు 350 ఎకరాల అసైన్డ్ భూములకు ఆర్థిక శాఖ మంత్రి చేతుల మీదుగా సంపూర్ణ భూహక్కు పత్రాలను పంపిణీ చేశారు. ముందుగా గ్రామ సమీపంలో రూ. 22 లక్షలతో పూర్తయిన ఆర్బీకేను డోన్ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి ఏఓ కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు భరత్ కుమార్ రెడ్డితో కలిసి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. గత టీడీపీ హయాంలో జరిగిన భూ అక్రమాలను వెలికితీసి భూములు సాగు చేసుకుంటున్న నిజమైన రైతులకు అందజేసి న్యాయం చేశామన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో చంద్రబాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ పథకం అంతా ఒక బూటకమని మంత్రి బుగ్గన ఎద్దేవా చేశారు. రైతులు, పొదుపు మహిళలకు రుణాల మాఫీ, పుట్టిన ప్రతి బిడ్డకు మహాలక్ష్మి పథకం పేరుతో రూ. 30 వేల చొప్పున ఇస్తామని చెప్పి ఇవ్వలేకపోయారు. చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారంటీ లేదని వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికేనని, తప్పక అధికారంలోకి వస్తామన్నారు. బేతంచెర్ల, డోన్, ప్యాపిలిలో డోన్ టీడీపీ ఇన్‌చార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి ఒక్కొక్కరికి సెంటున్నరస్థలం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని, అందరూ గమనించాలన్నారు. బేతంచెర్ల పట్టణంలోనే 12 వేల మందికి సెంటున్నర స్థలం కోసం 300 ఎకరాలు అవసరమని, అందుకోసం ఎకరాకు రూ. 50 లక్షల చొప్పున రూ.150 కోట్లు భరించాలన్నారు. ఓటమి భయంతోనే నెరవేర్చలేని హామీలను ప్రకటిస్తున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు ఆధార్ కార్డు, ఓటీపీ వివరాలు అడిగితే చెప్పవద్దని సూచించారు.

ఆత్మీయంగా పలుకరిస్తూ..

పట్టణంలోని గొరిపేట, బైటి పేట కాలనీల్లో సోమవారం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పర్యటించారు. ఆయా కాలనీల్లో మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఏవైన సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వచ్చే నెల నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక రూ. 3 వేలు ఇస్తామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీ కృష్ణ, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఖాజా, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు, వార్డు కౌన్సిలర్స్ చింతల నాగిరెడ్డి, మధు, ఇబ్రహీమ్, సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, మాజీ సర్పంచ్ జగన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలకు 20న సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ కర్నూలు రీజియన్‌లో కారుణ్య నియామకాల కింద కండక్టరు, డ్రైవర్, శ్రామిక్ (అసిస్టెంట్ మెకానిక్) ఉద్యోగాలు ఇచ్చేందుకు ఈ నెల 20న సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి టి. వెంకటరామం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన వారు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు, ఒక సెట్ జిరాక్స్‌తో బుధవారం ఉదయం 10గంటలకు కర్నూలులోని రీజినల్ మేనేజరు కార్యాలయానికి హాజరు కావాలని కోరారు.

ఆశాజనకంగా ఎండుమిర్చి ధరలు



నంద్యాల(సెంట్రల్): పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో ఎండు మిర్చి అమ్మకాలు సోమవారం ఆశాజనకంగా కొనసాగాయి. ముఖ్యంగా సూపర్-10 రకం సరకు జనరల్ క్వింటాలు గరిష్ట ధర రూ.21,200, మధ్యస్థ ధర రూ.18,500, కనిష్ట ధర రూ.16,700 పలికింది. ఇదే రకం తాలుకాయ గరిష్ఠ ధర క్వింటాలు రూ.11,300, మధ్యస్థ ధర రూ.10,200, కనిష్ట ధర రూ.8,200గా నమోదైనట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు. అన్నదాతలందరూ దళారులను నమ్మి మోసపోకుండా యార్డులోని ధ్రువీకృత వ్యాపారస్తుల వద్దే సరకు అమ్ముకుని మంచి ధరను పొందాలని ఆమె సూచించారు.

మూడు పథకాలు.. రూ. 3.12 లక్షల లబ్ధి



మా కుటుంబానికి జగనన్న ప్రభుత్వంతో మూడు పథకాల ద్వారా రూ. 3,12,786 లబ్ధి చేకూరింది. నాకు వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా వృద్ధాప్య పింఛన్ కింద ఇప్పటి వరకు రూ.82,000, ప్రమాదంలో చెయ్యి విరిగిపోగా ఆపరేషన్‌కు ఆరోగ్యశ్రీ ద్వారా రూ.30,786 ప్రభుత్వం ఇచ్చింది. అలాగే పేదలకు ఇంటి స్థలం ద్వారా రూ.2 లక్షల విలువైన స్థలం వచ్చింది. గతంలో మేము ఎన్నడూ ఏ ప్రభుత్వం నుంచి లబ్ధి పొందలేదు. ప్రస్తుతం మాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. అలాగే పింఛన్ కూడా గ్రామ వలంటీర్ ఇంటికి వచ్చి ఇస్తున్నారు. గతంలో ఎంతో పడిగాపులు కాస్తేగాని పింఛన్ సొమ్ము చేతికి వచ్చేది కాదు. మాలాంటి పేదలకు ఇలాంటి పథకాలు కలకాలం ఉండాలని ఆశిస్తున్నాం.

– రంగలక్ష్మమ్మ, చాకరాజువేముల, డోర్నిపాడు మండలం

సంక్షేమ బావుటా

ప్రభుత్వ సాయంతో ఇల్లు కట్టుకున్నాం



గత 15 ఏళ్లుగా నంద్యాల పట్టణంలో మేము నివాసముంటున్నాం. మాకు సొంతంగా ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. అద్దె చెల్లిస్తున్నా ఇంటి యజమానులకు అనుగుణంగా లేక పోతే చాలా రకాల ఇబ్బందులు వచ్చేవి. మాకు ఇద్దరు పిల్లలు, బాబు 7వ తరగతి, పాప 5వ తరగతి చదువుతుంది. నా భర్త బోదనం వెంకట రమణయ్య ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు. వచ్చే జీతంలో కొంత మిగుల్చుకుని స్థలం కొనుగోలు చేశాం. అయితే సొంత ఇళ్లు నిర్మించుకోవాలన్న మా కోరికకు ప్రభుత్వం రూ.1.80లక్షల ఆర్థిక సాయం తోడవ్వడంతో మా కల నెరవేరింది. గతంలో మాకు ఇలా ఇళ్లు నిర్మించుకోవాలని ఎవరూ చెప్పే వారు లేరు, కానీ నేడు మా ఇంటి వద్దకే అధికారులు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలని చెప్పడమే కాకుండా బిల్లులన్నీ మంజూరయ్యేందుకు చాలా కృషి చేశారు. మా పిల్లలకు అమ్మ ఒడి, ఇతర పథకాలన్ని అందుతున్నాయి.

– బోదనం సావిత్రి, జగ్జననీ నగర్, నంద్యాల

వైద్య పరిమితి పెంపు చరిత్రాత్మక నిర్ణయం

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తదితరులు

నంద్యాల: వైద్యం కోసం పేదవాడు అప్పుల పాలు కాకూడదనే ఉద్దేశంతో ఆరోగ్యశ్రీ కార్డు వైద్య పరిమితిని రూ. 25 లక్షల వరకు పెంచుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించే కార్యక్రమాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని నంద్యాల కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, ముస్లిం మైనారిటీ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, ప్రజాప్రతినిధులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా ఎర్రబోతుల పాపిరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీపై మరింత అవగాహన కల్పిస్తూ కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీలో చికిత్స తీసుకున్న రోగి పూర్తిగా కోలుకునే వరకు ఆరోగ్య ఆసరా కింద నెలకు రూ.5,000 చొప్పున ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఖ్యను గణనీయంగా పెంచిందన్నారు.

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్యాన్సర్ వంటి వ్యాధులకు ఎలాంటి పరిమితులు లేకుండా ఎంత ఖర్చయినా పూర్తి ఉచితంగా చికిత్స అందిస్తోందన్నారు. పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ జిల్లాలో కొత్త ఫీచర్లతో కూడిన నూతన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు.
- రాష్ట్ర ముస్లిం మైనారిటీ సలహాదారు హబీబుల్లా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు నంద్యాలలో రూ.475 కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మించి ప్రారంభించారన్నారు. ఆరోగ్యశ్రీ కొత్త కార్డులలో పేషెంట్‌కు సంబంధించిన వివరాలు ఉంటాయని, ఆరోగ్య శ్రీ కింద చికిత్స పొందిన వారికి మందులు ఉచితంగా డోర్ డెలివరీ చేస్తామన్నారు.
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పేద ప్రజలు ఉచితంగా వైద్యం ఎలా చేయించుకోవాలి, ఎక్కడకు వెళ్లాలి, ఆరోగ్యశ్రీ సేవలు ఎలా పొందాలి, ఎవరిని అడగాలి అనే సందేహాలన్నింటికి వివరంగా ప్రతి ఇంటిలోనూ వివరించే కార్యక్రమాలు చేపట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.
- అనంతరం జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులకు కొత్త ఫీచర్లతో కూడిన నూతన ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డా. రూపేంద్రనాథ్ రెడ్డి, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరప్రసాద్, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గృహ ప్రవేశానికి వెళ్లి వస్తూ..

● రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వెంకటేష్ (ఫైల్)

తుగ్గలి: గృహ ప్రవేశానికి వెళ్లి వస్తూ ఒకరు మృతి చెందిన ఘటన తుగ్గలి సమీపంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని మామిళ్లకుంట వెంకటేష్(42) సోమవారం గుంతకల్లులో తమ బంధువుల గృహ ప్రవేశానికి హాజరై తిరిగి సాయంత్రం స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గ మధ్యలో తుగ్గలి-పెరవలి గ్రామాల మధ్య రైల్వే స్టేషన్‌కు వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ఆదోని వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే కాన్పులో ముగ్గురు



ఆరోగ్యంగా ఉన్న ముగ్గురు మగ శిశువులు

కర్నూలు(హాస్పిటల్): ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు జన్మించారు. దీంతో ఆ తల్లి సంతోషానికి హద్దులు లేకుండా పోయింది. తెలంగాణ రాష్ట్రం ఐజ మండలం చిన్నతాండ్రపాడు గ్రామానికి చెందిన శిరీష(26)కు మూడేళ్ల క్రితం ఎస్.శ్యామ్‌తో వివాహమైంది. పిల్లల కోసం ఆమె కర్నూలులోని డాక్టర్ శశికళను సంప్రదించగా గర్భం నిలబడింది. స్కానింగ్ చేయడంతో ఆమె కడుపులో ముగ్గురు శిశువులు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అప్పటి నుంచి నెలలు నిండే వరకు ఎంతో జాగ్రత్తలు పాటిస్తూ చికిత్స తీసుకుంటూ వచ్చారు. ఈ నెల 12వ తేదీన ఆమె ముగ్గురు శిశువులను ప్రసవించింది. అది కూడా ముగ్గురు మగపిల్లలు కావడం గమనార్హం. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండటంతో సోమవారం ఆమెను, శిశువులను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.

GOVERNMENT OF ANDHRA PRADESH
OFFICE OF THE DISTRICT MEDICAL AND HEALTH OFFICER, KURNOOL

(Notification No. 24/UPHC/KNL/2021, dt. 18.12.2023)

RECRUITMENT NOTIFICATION TO THE TWO VACANT POSTS OF MEDICAL OFFICER (MBBS), AT UPHCs, OF KURNOOL DISTRICT ON CONTRACT BASIS THROUGH WALK-IN-INTERVIEW.

Applications are invited from the eligible candidates for recruitment to two vacant posts of Medical Officers (MBBS) at UPHCs of Kurnool District on contract basis initially for a period of one year. **"WALK-IN-INTERVIEW"**, under the following Roster Ponts.

S. No.	Cycle No.	Roster Point	Roster Category
1	2	22	SC-Women
2	2	29	BC-A

APPLICATION FORM and PROSPECTUS (Eligibility details etc.) are uploaded to the Kurnool District website - https://kurnool.ap.gov.in and Nandyal District Website https://nandyal.ap.gov.in.

Eligible candidates should download the APPLICATION FORM from the Kurnool District website - https://kurnool.ap.gov.in (or) Nandyal District Website https://nandyal.ap.gov.in. and to attend for the **WALK-IN-INTERVIEW** in the O/o District Medical and Health Officer, Kurnool on **22.12.2023** between 10.30 AM to 5.00 PM with the filled in APPLICATION FORM, along with all original Certificates/documents and one set of Xerox copies of the same.

Sd/- Dr. B.Ramagiddaiah, Dist. Medical & Health Officer, KURNOOL.	Sd/- Dr. G. Srijana , IAS Collector and District Magistrate, KURNOOL.

దుస్థితి తొలగి దూసుకుపోయేలా..!



గతంలో హోసూరు-మొలగవల్లి రోడ్డు దుస్థితి



ప్రస్తుతం బీటీరోడ్డు వేసిన దృశ్యం

- నెరవేరిన దశాబ్దాల కల
- పూర్తయిన హోసూరు-మొలగవల్లి బీటీరోడ్డు
- ప్రత్యేక చొరవ చూపిన పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: మట్టి రోడ్డు.. వర్షాకాలం అడుగు తీసి అడుగు వేయాలన్నా కష్టమే..దశాబ్దాల నాటి ఈ సమస్యకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కారం చూపారు. ప్రభుత్వం రూ.7.20 కోట్ల నిధులు విడుదల చేయడంతో ఇటీవలే పనులు పూర్తయ్యాయి. పత్తికొండ మండలం హోసూరు గ్రామం నుంచి ఆలూరు నియోజకవర్గం లోని మొలగవల్లి గ్రామ రైల్వేస్టేషన్ వరకు 10 కిలోమీటర్ల మట్టి రోడ్డు ఉంది. దీని వెంట హోసూరు, మొలగవల్లి, కొట్టాల గ్రామాలకు చెందిన రైతులకు వేలాది ఎకరాల భూములు ఉన్నాయి. అధ్వాన రోడ్డుతో ప్రతి ఏటా వర్షాకాలంలో పొలాలకు వెళ్లడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. టీడీపీ హయాంలో అప్పటి డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి 2019 ఫిబ్రవరి 12న రోడ్డు నిర్మాణం చేపడతామని భూమిపూజ చేసి శిలాఫలకం వేశారు. రూ. 3.75కోట్ల నిధులు విడుదల చేశామని, పనులు త్వరలోనే పూర్తవుతాయని ప్రజలకు హామీ ఇచ్చారు. హామీ శిలాఫలక ఆవిష్కరణకే తప్ప ఆచరణకు నోచుకోలేదు. రైతుల కష్టాలను తెలుసుకున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. హోసూరు గ్రామం నుంచి కురువకొట్టాల గ్రామం వరకు 7.5 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి మధ్యలో 9 బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.7.20కోట్లు మంజూరు చేయించారు. ఇటీవలనే పనులు పూర్తయ్యాయి. వర్షాకాలంలో పొలాలకు వెళ్లలేని దుస్థితి నుంచి ఇపుడు ఏ సమయంలోనైనా ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు సాఫీగా ప్రయాణం సాగిస్తున్నారు. దశాబ్దాల కల నెరవేరడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐకు కన్నీటి వీడ్కోలు



జవాన్ అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, గ్రామస్తులు

● నివాళులర్పించిన ఎమ్మెల్యే కాటసాని, పోలీసు ఉన్నతాధికారులు



పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు చేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: మావోయిస్టుల ఎదురు కాల్పుల్లో వీర మరణం పొందిన కోవెలకుంట్ల మండలం వెలగటూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ గొంగటి సుధాకర్‌రెడ్డికి సోమవారం గ్రామస్తులు కన్నీటి వీడ్కోలు పలికారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం జరిగిన కాల్పుల్లో ఏఎస్ఐ వీరమరణం పొందగా సోమవారం మధ్యాహ్నం పార్థీవదేహాన్ని సీఆర్‌పీఎఫ్ డీఐజీ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనం ద్వారా స్వగ్రామానికి చేర్చారు. జవాను మృతదేహానికి బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య, కోవెలకుంట్ల సీఐ రామానుజులు, ఎస్ఐలు వెంకటరెడ్డి, మౌలానీ, గ్రామ సర్పంచ్ ఎల్వీ సుధాకర్‌రెడ్డి, సీఆర్‌పీఎఫ్, ఆర్మ్‌డ్ రిజర్వర్ ఎస్ఐలు సుధాకర్‌రెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు బంధువులు, స్నేహితులు అధిక సంఖ్యలో గ్రామాన్ని చేరుకోవడంతో వెలగటూరు శోకసంద్రంగా మారింది. భార్య నాగలక్ష్మి, కుమారులు సూర్యచైతన్యరెడ్డి, జయగణేష్‌రెడ్డిలను పలువురు ఓదార్చారు. అనంతరం శాంతిరథంలో సుధాకర్‌రెడ్డి అంతిమ యాత్ర కొనసాగింది. గ్రామ శివారులోని ఆయన సొంత పొలంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు దేశ సేవకు అంకితమై సుధాకర్‌రెడ్డి చివరకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించారన్నారు. ఆ కుటుంబానికి తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్‌ను వర్తింపజేసేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఖైరుప్పలలో ఘనంగా స్వామివార్ల నిశ్చితార్థం



వీరభద్రస్వామికి హారతి ఇస్తున్న పూజారి



ప్రత్యేక అలంకారంలో కాళికాదేవి

ఆస్పరి: మండలంలోని ఖైరుప్పల గ్రామంలో శ్రీవీరభద్రస్వామి, కాళికాదేవి నిశ్చితార్థ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాన్ని తిలకించడానికి ఆస్పరి, కారుమంచి, వెంగళాయిదొడ్డి, చెన్నంపల్లి, పుప్పాలదొడ్డి, ములుగుందం, యాటకల్లు, తొగలుగల్లు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. ముందుగా ఆలయంలో వీరభద్రస్వామి, కాళికాదేవికి ఆకుపూజ చేశారు. పంచామృతాభిషేకం, కుంకుమార్చన తర్వాత గ్రామంలోని ఇరువర్గాలకు చెందిన పెద్దలు తాంబూలాలు మార్చుకున్నారు. గ్రామంలో పార్వతీ, పరమేశ్వరుల, వీరభద్రస్వామి, కాళికాదేవి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. వచ్చే ఉగాది పండుగ రోజు స్వామి, అమ్మ వారి పెళ్లి జరుపుతామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగానే ఖైరుప్పలలో భక్తులు ఇరువర్గాలుగా విడిపోయి పిడకల (నుగ్గుల) ఆట ఆడతారు.

ఇంటి నుంచి గెంటేశారు..

● న్యాయం చేయాలని ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన వృద్ధురాలు



ఏఎస్పీ సర్కార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

కర్నూలు: వృద్ధాప్యంలో అండగా నిలవాల్సిన కుమార్తెలు వేధిస్తున్నారని, తన భర్త మొదటి భార్య కుమారుడు ఆస్తి ఇవ్వకుండా ఇంటి నుంచి బయటకు గెంటేసి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని అడిషనల్ ఎస్పీ టీ సర్కార్‌కు కల్లూరుకు చెందిన వృద్ధురాలు రూతమ్మ ఫిర్యాదు చేశారు. తనకు రావాల్సిన ఆస్తిని ఇప్పించి న్యాయం చేయాల్సిందిగా కోరారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి ఏఎస్పీ ఫిర్యాదులు స్వీకరించి, నేరుగా వారితో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా స్పందనకు 83 ఫిర్యాదులు రాగా.. వాటన్నింటిపై చట్టపరిధిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు తదితరులు స్పందనలో పాల్గొన్నారు.

స్పందనకు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ....

- ఫోర్జరీ సంతకాలతో కోడలు సుగుణమ్మ ఆస్తి కాజేసి మోసం చేసి ఇబ్బందులకు గురి చేస్తోందని ఎమ్మిగనూరు మండలం ఎర్రకోట గ్రామానికి చెందిన సుంకమ్మ ఫిర్యాదు చేశారు.
- తన 47.5 సెంట్ల పొలాన్ని మామ కొడుకు శేఖరయ్య ఆక్రమించుకొని రామదాసు అనే వ్యక్తికి అమ్మి మోసం చేశారని కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన శివమ్మ ఫిర్యాదు చేశారు.
- జాబ్‌యార్డు ఆఫీస్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని డబ్బులు తీసుకొని కర్నూలులోని ఎంఆర్‌బీ ట్రేడ్ సెంటర్‌లో వినయ్‌కుమార్ అనే వ్యక్తి మోసం చేస్తున్నాడని, తనతో రూ.10 వేలు తీసుకొని ఇవ్వడం లేదని ఆళ్లగడ్డకు చెందిన మాబుసుభాన్ ఫిర్యాదు చేశారు.
- కుమారులు తన బాగోగులు పట్టించుకోకుండా అన్నం కూడా పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కర్నూలు ఎస్ నాగప్ప వీధికి చెందిన నాగగోపాల్ ఫిర్యాదు చేశారు.
- బ్యాంకు ఖాతాలో పిల్లల చదువు కోసం దాచుకున్న రూ.60 వేలల్లో రూ.20 వేలు గుర్తు తెలియని వ్యక్తులు కాజేశారని, ఈ సంఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని కర్నూలు మండలం జి సింగవరం గ్రామానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.

అర్జీలు పరిష్కరించకపోతే చర్యలు



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించకపోతే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ..స్పందన అర్జీలు రీఓపెన్ కాకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా స్పష్టమైన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నాగప్రసన్నలక్ష్మీ, రమ పాల్గొన్నారు.

వివాహిత బలవన్మరణం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన కె.మల్లేశ్వరి(34) అనే వివాహిత సోమవారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. పెద్దకడుబూరు మండలం హెచ్.మురవణి గ్రామానికి చెందిన కె. మల్లేశ్వరితో గువ్వలదొడ్డికి చెందిన కె. గుడ్డి ఈరన్నతో ఏడు సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె జోస్మిత, కుమారుడు పురుషోత్తం ఉన్నారు. భార్యాభర్తల మధ్య తరుచూ గొడవ జరిగేదని గ్రామస్థులు తెలిపారు. కె.మల్లేశ్వరి.. సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా గుర్తించిన ఇంటి పక్కల వారు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రభుత్వాసుపత్రికి తరలించే మార్గమధ్యలో ఆమె మృతి చెందింది. కుమార్తె మృతి చెందిన విషయాన్ని హైదరాబాద్‌కు వలస వెళ్లిన తల్లిదండ్రులకు సమాచారం అందించారు.

యువకుడి బలవన్మరణం



సతీష్ (ఫైల్)

అనంతపురం క్రైం: జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా పాములపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన ఎ.రాముడు కుమారుడు సతీష్ (27) బీటెక్ పూర్తి చేసి, శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే తన స్నేహితులతో కలసి అనంతపురంలోని బుడ్డప్పనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. నాలుగు నెలల క్రితం అందరూ తలా ఓ వైపు వెళ్లిపోవడంతో సతీష్ ఒక్కడే ఆ ఇంట్లో ఉంటున్నాడు. ఏం జరిగిందో తెలియదు కానీ సోమవారం ఉదయం 11 గంటలకు తన చిన్ననాటి స్నేహితులైన వసుధ, శివకృష్ణకు వేర్వేరుగా వీడియో కాల్ చేసి, తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపి ఫోన్ కట్ చేశాడు. దీంతో స్నేహితులిద్దరూ వారుంటున్న ప్రాంతం నుంచి సతీష్ గదికి చేరుకునేలోపు లోపల తలుపునకు గడి పెట్టుకుని వైరుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. స్థానికుల సహకారంతో సతీష్‌ను కిందకు దించి వెంటనే ఆటోలో ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. విషయం తెలుసుకున్న సతీష్ తల్లిదండ్రులు సోమవారం సాయంత్రం అనంతపురానికి చేరుకున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ రెడ్డప్ప తెలిపారు.

నేడు రైతులతో సమావేశం

చాగలమర్రి: 440 నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల భూములకు సంబంధించి అవార్డు ఎంక్వయిరీ కార్యక్రమం మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సుభద్రమ్మ సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నుంచి చాగలమర్రిలోని 40వ నంబరు జాతీయ రహదారి వరకు నిర్మిస్తున్న 440వ నంబరు జాతీయ రహదారి నిర్మాణంలో మండలంలోని చాగలమర్రి, మల్లేవేముల గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి భూములను హైవే అథారిటీ అధికారులు తీసుకుంటున్నారు. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం నష్టపరిహారాన్ని రైతులకు చెల్లించటానికి అవార్డు ఎంక్వయిరీ కార్యక్రమాన్ని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 గంటకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ యజమానులు వాటికి సంబంధించిన ధ్రువ పత్రాలు, ఆధార్, 2 ఫొటోలతో హాజరు కావాలని కోరారు.

రేపు జాబ్‌మేళా

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మునిశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగం చేసేందుకు జాబ్‌మేళా చేపట్టామన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ పూర్తి చేసిన యువతీ, యువకులు ధ్రువపత్రాలు, ఆధార్, పాస్ పోర్టుసైజ్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు. 18-30 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు.

27 నుంచి కుష్టు రోగుల గుర్తింపు



పోస్టర్లను విడుదల చేస్తున్న జేసీ మౌర్య

కర్నూలు(సెంట్రల్): కుష్టు రోగుల గుర్తింపు కార్యక్రమాన్ని ఈ నెల 27 నుంచి పకడ్బందీగా చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాధికారులను జేసీ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనకు సంబంధించి పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. అనంతరం కుష్టు రోగుల గుర్తింపు కార్యక్రమంపై సమన్వయ కమిటీతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు ఇంటింటా సర్వే నిర్వహించాలన్నారు. జిల్లాలో మొత్తం 1,700 బృందాలను ఏర్పాటు చేశామని, ప్రతి బృందంలో ఆశావర్కర్, వలంటీర్ ఉండేలా చూడాలన్నారు. ఆడ వారిలో కుష్టు రోగులను గుర్తించేందుకు ఆశా వర్కర్, మగవారిలో కుష్టు రోగి లక్షణాలను గుర్తించేందుకు వలంటీర్‌కు బాధ్యతలు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మధుసూదన్‌రావు, జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ భాస్కర్, డీఎస్‌ఎం డాక్టర్ మల్లికార్జున, హెచ్ఈఓ శివ శంకర్‌రావు, డీపీఎంఓ హక్ పాల్గొన్నారు.

రూ.లక్ష అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ పట్టుబడిన కేసులో కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామానికి చెందిన హుస్సేన్‌బాషా కుమారుడు చాంద్‌బాషా నుంచి రూ. లక్ష అపరాధ రుసుం వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ సోమవారం విలేకరులకు తెలిపారు. కల్లూరు మండలం తడకనపల్లె, ఓర్వకల్లు మండలం నన్నూరు పరిసరాల పరిధిలోని సర్వే నంబర్ 1092/3, 1403లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్న మూడు హిటాచీలను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి యజమాని చిన్నటేకూరు గ్రామానికి చెందిన చాంద్‌బాషా నుంచి రూ.లక్ష అపరాధ రుసుం వసూలు చేశామన్నారు.

24న భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు

నంద్యాల(వ్యవసాయం): గీతా జయంతిని పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీన నంద్యాల జిల్లాలోని విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పోటీలు నంద్యాల పట్టణంలో మెయిన్‌బజార్‌లోని అమ్మవారిశాల గీతా మందిరంలో ఏర్పాటు చేశామన్నారు. 18 సంవత్సరాల లోపు, ఆపైబడిన వారికి పోటీలు ఉంటాయన్నారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులతో పాటు ప్రశంసా పత్రం అందజేస్తామని చెప్పారు.వివరాలకు సెల్: 9059802265, 9441008677 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మందుబాబులకు జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మద్యం సేవించి వాహనాలు నడిపిన మందుబాబులకు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేశారని పోలీసు సిబ్బంది సోమవారం తెలిపారు. వివరాలు..స్థానిక రాణిమహారాణి థియేటర్ వద్ద, ఐటీసీ కంపెనీ రోడ్డు వద్ద టూటౌన్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడిపిన పట్టణంలోని నందమూరి నగర్ కు చెందిన తిరివీధి ధనుంజయ, వీర ప్రసాద్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి వారికి ఐదు రోజుల పాటుజైలుశిక్ష విధించారని పోలీసులు చెప్పారు.

కమిషన్ తీర్పును ఖాతరు చేయని డాక్టర్‌కు అరెస్ట్ వారెంట్

కర్నూలు(లీగల్): జిల్లా వినియోగదారుల కమిషన్ ఇచ్చిన తీర్పును ఖాతరు చేయని డాక్టరుకు అరెస్ట్ వారెంట్లు జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. కర్నూలు ప్రకాష్‌నగర్‌కు చెందిన పీ రోషిన్‌ఖాన్ తన భార్య కాన్పు కోసం ఎన్ఆర్ పేటలోని సరస్వతి నర్సింగ్ హోంలోని డా. వేణుగోపాల్‌ను సంప్రదించారు. అయితే నర్సింగ్ హోంలో డాక్టరు అందుబాటులో లేనందున వేరే ఆసుపత్రికి వెళ్లమని సూచించారు. దీంతో ఆయన తన భార్యను స్థానిక యునానీ ఆసుపత్రి, ఆ తర్వాత కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చూపించారు. అక్కడి వైద్యులు బాధితురాలికి కాన్పు చేయగా, శిశువు మృతి చెందింది. దీంతో డాక్టర్ వేణుగోపాల్‌పై కేసు దాఖలు చేశారు. కేసు విచారించిన ఫోరం.. ఫిర్యాదుదారుకు రూ.5 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని 2016లో డాక్టరును ఆదేశించింది. దీంతో సదరు డాక్టరు రాష్ట్ర వినియోగదారుల కమిషన్‌లో అప్పీల్ దాఖాలు చేశారు. అయితే ఆ అప్పీల్ కూడా డిస్మిస్ అయ్యింది. దీంతో ఫిర్యాది తీర్పు అమలు కోసం తిరిగి జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలోనే డాక్టరుకు అరెస్ట్ వారెంట్ జారీ చేస్తూ జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఎస్ నారాయణరెడ్డి, నసీమాకౌసర్ ఆదేశాలు జారీ చేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివసిస్తున్న కొంగలేటి కాశయ్య (40) అనే అవివాహితుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. టూటౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. కాశయ్య మానసిక స్థితి సరిగా ఉండేది కాదు. గతంలో ఓసారి గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఇంటిపైన పడుకున్న వ్యక్తి తెల్లవారుజామున చూసే సరికి మిద్దె పై నుంచి కింద పడి మృతి చెంది ఉన్నాడు. కుటుంబీకులు గుర్తించి సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుపోగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి తండ్రి రంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ తెలిపారు.

వినతుల పరిష్కారంపై దృష్టి సారించండి



వినతులను పరిశీలిస్తున్న డీఆర్వో పుల్లయ్య

నంద్యాల: స్పందన కార్యక్రమంలో వచ్చిన వినతుల పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో జిల్లా నలమూలల నుంచిడి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ స్పందన ఈకేవైసీపై శాఖల వారీగా వారం వారం సమీక్ష నిర్వహిస్తామన్నారు. స్పందనలో 205 దరఖాస్తులు వచ్చాయని, ఏ ఒక్క దరఖాస్తు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్లకుండా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వినతుల్లో కొన్ని..

- సుగాలి మెట్టకు చెందిన పెసరవాయి వెంకటసుబ్బమ్మకు సర్వే నంబర్ 2363/1 లో 1.1/4 విస్తీర్ణం ఇంటి స్థలం ప్లాట్ నెంబర్ 266 ఉందని, అయితే కె.కలాం అనే వ్యక్తి ఆ స్థలాన్ని కబ్జా చేసి బేసిమట్టం నిర్మించుకున్నారని, విచారించి తన స్థలాన్ని ఇప్పించాలని వినతి పత్రం సమర్పించింది.
- అవుకు మండలానికి చెందిన పోతుల నాగభూషణానికి సర్వే నంబర్ 766/2అ లో 4.45 ఎకరాల ప్రభుత్వ భూమిని సాగు చేసుకునేందుకు అవుకు తహసీల్దార్ డి పట్టా మంజూరు చేశారని, ఆ భూమిని ఆన్‌లైన్‌లో తన పేరుతో నమోదు చేయాలని వినతి పత్రం అందజేశాడు.